# ఊహ

కూలబడ్డాడు తన రిషాలో రాములు.

ఇంకా సినిమా వదలలేదు. వదిలితేనే బేరం తగిలేది. అలా ఇంకా ఎన్నో ఆటోలు, రిషాలు ఆ హాలు ముందు పడిగాపులు కాస్తున్నాయి.

తీరిగ్గా బీడీ అంటించిన రాములు మనసులో రకరకాల ఆలోచనలు—

సరిగా వారం రోజుల్లో లక్ష్మి తన జీవితంలోకి ప్రవేశిస్తుంది. ఆమె అదృష్టంతోనయినా తన జీవితం బాగుపడితే బాగుండు!

పెళ్ళికాగానే లక్ష్మితోసాటు తనూ రిషాల్లో తిరగాలి. తను తొక్కడు. లక్ష్మి సరసన కూర్చుని ఝామ్మంటూ ప్రయాణం చేస్తాడు.

—అతను ఆలోచనల్తో సతమతమవుతుండగానే సినిమా వదిలారు.

ఆ జనంలో అతని కళ్ళని చటుక్కున్న ఆకర్షించింది ఓ ముచ్చటైన జంట. గబగబా రిషాని వాళ్ళవేపు లాక్కుపోయాడు - "రిషా కావాలా బాబూ...." అంటూ.

మధ్యలో అడ్డువచ్చి "రిషా! వస్తావా?" అన్న వాళ్ళని అసహ్యంగా చూసాడు. ఆనందంగా తన అభిమాన జంటవేపు బండితో దారితీశాడు.

బేరం ఊసెత్తకుండా వాళ్ళ నెక్కించుకుని ముందు కురికించాడు రిషాని.

అతని మనసునిండా తియ్యని వూహలే! వాళ్ళిద్దరిలో తనని, లక్ష్మిని చూసుకొంటున్నాడు. వాళ్ళ గుసగుసలు అతనికి గిలిగింత లయ్యాయి. బండికన్నా అతని వూహలు వేగంగా పరుగెత్తుతున్నాయి.

"ఏయ్ రిక్షా.... ఆపు.... "కంగారుగా కేకేసింది రిక్షాలో కూర్చున్నామె.

''మరికొంచెం ముందుకు వెళ్ళిన తర్వాత ఆపుదాంలే....'' రిక్షాలో కూర్చున్నతను గొణిగినట్లున్నాడు.

"వద్దు. ఆ సందు తిరిగితే తెలిసినవాళ్ళెవరైనా చూస్తే బాగుండదు. మా ఆయనకి తెలిసిదంటే - అమ్మో...." ఆమె మాటలు సన్నగా చెవిని పడగానే కళ్ళు గిర్రున తిరిగినట్లనిపించింది రాములుకి. రిక్షా ఆగి పోయింది.

చటుక్కున ఆమె దిగింది.

''వెనక్కి పోనీయవోయ్...." రిక్షా దిగకుండానే ఆజ్ఞాపించా డతను.

రాములు వూహ కరిగిపోయింది. ''నేను వెనక్కిరాను బాబూ! మీరూ దిగిపోండి....'' అతనికి తెలీకుండానే అతని నోటవెంట ఆ మాటలు కాస్త కర్కశంగానే వచ్చాయి.

(స్వాతి సపరివారపత్రిక)